సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం

- బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్లు
- భావితరాల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

అంగన్‌వాడీ కేంద్రాల వారీగా లబ్ధిదారుల వివరాలు

15వ వార్డు :		
వెంకోజీపాలెం-2	గర్భిణులు 10	బాలింతులు 7
16వ వార్డు :		
అంబేద్కర్ కాలనీ	గర్భిణులు 15	బాలింతలు 10
కేఆర్‌ఎం కాలనీ-1	గర్భిణులు 18	బాలింతలు 15
కేఆర్‌ఎం కాలనీ-2	గర్భిణులు 20	బాలింతలు 13
కేఆర్‌ఎం కాలనీ-4	గర్భిణులు 25	బాలింతలు 16
23వ వార్డు :		
మద్దిలపాలెం-1	గర్భిణులు 35	బాలింతలు 25
మద్దిలపాలెం-2	గర్భిణులు 15	బాలింతలు 13
మద్దిలపాలెం-3	గర్భిణులు 10	బాలింతలు 8



ఇసుకతోట అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుకు సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న సిబ్బంది(ఫైల్)

మద్దిలపాలెం : గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన ఆరోగ్యం కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.850లకు పైగా విలువ చేసే పౌష్టికాహారం కిట్లను అందిస్తోంది. పేదలకు సంపూర్ణ పోషణ పథకం వరంగా మారింది. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో గర్భిణులు రక్తహీనత సమస్యతో సతమతమై పుట్టేబిడ్డ ఎలా ఉంటుందోనని బెంగతో తల్లడిల్లిపోయేవారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు వారికి వరంగా మారాయి. ఈ కిట్లలో బియ్యం, పప్పు, పాలు, గుడ్లు అదనంగా మరో ఆరు పోషక పదార్థాలు అందిస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలో సరకుల వివరాలు

మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, 5 లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల వేరు శనగ చెక్కీలు, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల బెల్లం అందిస్తున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేసి గర్భిణుల కష్టాలు తీర్చారు. సకాలంలో సరైన పౌష్టికాహారం గర్భిణులకు ఎంతో అవసరం. అలాంటి సమతుల్యమైన ఆహారాన్ని కొనుక్కొని తీనాలంటే చాలా కష్టం. ఉచితంగా అందిస్తున్న సంపూర్ణ పోషణ కిట్లతో ఆ బాధలు తప్పాయి. సీఎం వైఎస్ జగన్‌కు మా కృతజ్ఞతలు.

– సునీత, లబ్ధిదారు

సరకుల్లో నాణ్యత ఉంది..



సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా నాణ్యమైన సరకులు అందుతున్నాయి. సకాలంలో తీసుకోవడంతో బిడ్డకు పౌష్టికాహారంతో కూడిన పాల అందించగలగుతున్నాం. ఈ పథకం మా బిడ్డల పాలిట వరం.

– ఎం.దేవి, బాలింత

ఆరోగ్యానికి శ్రీరామరక్ష



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు బాలింతలు, గర్భిణులకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయి. ఈ కిట్లలోని సరకులు అన్నీ పోషక పదార్థాలతో కూడుకుని ఉన్నాయి. కిట్ల పంపిణీపై లబ్ధిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– ఈర్ల దేవి, అంబేద్కర్ కాలనీ అంగన్‌వాడీ టీచర్

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు

బీచ్ రోడ్డు: డాక్టర్ బుల్లయ్య కాలేజీలో చదువుకున్న 1985–90 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి అధ్యాపకులు వెంకటరావు, పీవీఎస్ రామారావు, డి.రాజారావు, ఎన్.సత్యనారాయణ, స్వర్ణలత, తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.చిరంజీవి, డి.శ్రీనివాసరావు, డి.శివకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభేరి పుస్తకావిష్కరణ నేడు

మద్దిలపాలెం: ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో తెలుగు భేరి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుందని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరు కానున్నారని పేర్కొన్నారు. తెలుగు పద్యాలు, గేయాల సంకలనంగా రూపొందించిన ఈ పుస్తకాన్ని తెలుగుభాషా పరిరక్షణ దిశగా ఓ అడుగు అని పేర్కొన్నారు. భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, కాలువల నిర్మాణ పనులను ఆదివారం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమలో వైఎస్సార్‌సీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు శశికళ, యూత్ అధ్యక్షుడు ఉల్లంగల సూరిబాబు, మైనారిటీ అధ్యక్షుడు నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు నేర ప్రవృత్తి విడిచిపెట్టాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ త్రినాథ్

బీచ్ రోడ్డు: నగరంలోని రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడిచిపెట్టి సత్ప్రవర్తనతో మెలగాలని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ సూచించారు. ఆదివారం నగరంలోని రౌడీషీటర్లకు ఎంవీపీ కాలనీలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడకుండా మంచి నడవడిక కలిగి ఉన్నవారికి రౌడీషీట్లు మూసివేతకు కృషి చేస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారిపై ప్రత్యేక బృందాలు దృష్టిపెట్టాయని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు. అదేవిధంగా శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


‘రాముని కుక్కుర ఇన్ ఫిల్మ్స్’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంవీ రఘు, తదితరులు

ఎంవీపీ కాలనీ: డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, డీవీఎస్ఎన్ శర్మ సంయుక్తంగా రచించిన రాముని కుక్కుర ఇన్ ఫిల్మ్స్ పుస్తకాన్ని ప్రముఖ చలనచిత్ర సినిమాటోగ్రాఫర్, దర్శకుడు, రైటర్, నిర్మాత ఎంవీ రఘు ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ సినిమాలు ప్రజల జీవితాలను హత్తుకునే పాత్ర పోషిస్తాయన్నారు. జంతువుల నేపథ్యంగా తీసిన సినిమాలు సామాజిక స్పృహ, స్నేహభావంపై పెద్ద ఎత్తున ప్రభావం చూపుతాయన్నారు. ఇలాంటి నేపథ్యంతో రచించిన పుస్తకమే రాముని కుక్కుర ఇన్ ఫిల్మ్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి కొత్త నిచ్చెన



భవనంపై మొక్కలను కొత్త నిచ్చెన సాయంతో తొలగిస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చారిత్రక భవనాలను పరిరక్షించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రాతి భవనాలపై మొలిచే మొక్కలను తొలగించడానికి ప్రత్యేకంగా ఒక నిచ్చెన అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏయూ శానిటేషన్, బ్యూటిఫికేషన్ విభాగం ఆధ్వర్యంలో భవనాలపై పెరుగుతున్న మొక్కలను తొలగించే పనులను వేగవంతం చేశారు. ఈ నిచ్చెన సాయంతో ఎత్తయిన భవనాలను సులువుగా శుభ్రం చేస్తున్నారు. దీంతో రాతి భవనాల పటిష్టత పెరిగే అవకాశం ఉంది. ఈ నిచ్చెన సహాయంతో మొక్కలు తొలగించడం సిబ్బందికి సైతం సులభంగా ఉంది.

ఉన్నత విద్యపై ఆసక్తి అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

ఆరిలోవ: యువతకు ఉన్నత విద్యపై ఆసక్తి అవసరమని ఆరిలోవ సీఐ సోమశేఖర్ అన్నారు. బాలాజీ నగర్ ప్రాంతం అన్నానగర్‌లో ఆదివారం సాయంత్రం హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. పల్లెల్లో కూడా పేద యువత ఎంతో క్రమశిక్షణతో ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుకోగలుగుతుండడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్య అభ్యసించి, రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్, హ్యూమన్ రైట్స్ కార్యదర్శి బి.వి.నరేష్‌బాబు, స్థానిక నాయకుడు లింగంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్రం భూమి వేలం నేడు

భీమునిపట్నం: భీమిలిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన గంథం రామస్వామి సత్రం స్థలాన్ని వేలం వేయనున్నారు. ఇక్కడ చిన్నబజారు జంక్షన్ సమీపంలో 14 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని వివిధ వ్యాపారాల నిర్వహణకు వినియోగించుకునేలా వేలం వేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఉదయం పది గంటలకు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆధ్వర్యంలో వేలం వేయనున్నామని, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని నూకాలమ్మ వారి గ్రూప్ దేవాలయాల ఈవో బి.మురళీమోహన్ తెలిపారు.

ట్రక్కు డ్రైవర్ల సంక్షేమానికి పెద్ద పీట వేయాలి



ట్రక్కు డ్రైవర్లను సత్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్

మద్దిలపాలెం : ప్రజా రవాణతో పాటు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే ట్రక్కుల డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ కోరారు. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలోని శ్రీవేంకటేశ్వర మినీ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల సంఘం సభ్యులు ఆదివారం ఏఐటీయూసీలో చేరారు. వారికి గోవింద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లను ఇబ్బంది పెట్టే జీవో నంబర్ 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధురెడ్డి, సత్యనారాయణ, సాయి, రాజు పాల్గొన్నారు.

శంకుస్థాపన సరే.. పనులెప్పుడు?

- పది నెలల కిందట రామకృష్ణాపురం బ్రిడ్జి పనులకు శ్రీకారం
- ఇప్పటికీ పనులు చేపట్టని కాంట్రాక్టర్



రామకృష్ణాపురం గెడ్డపై ఎత్తు పెంచాల్సిన బ్రిడ్జి

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో బ్రిడ్జి పనులు ప్రారంభించి పది నెలలైనా ముందుకు కదల్లేదు. ఇక్కడ బ్రిడ్జి పనుల కోసం గతేడాది నవంబరు 2న శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ అప్పటి నుంచి ఇంత వరకు కనిపించలేదు. దీంతో ఆ బ్రిడ్జి పనులు మూలకు చేరాయి. కంబాలకొండల నుంచి వచ్చిన పెద్ద గెడ్డ ఈ గ్రామం మధ్యలో చెరువులో కలిసి అక్కడి నుంచి ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలుస్తుంది. గ్రామంలో ఈ గెడ్డపై కొన్నాళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి చిన్నది, ఎత్తు తక్కువ కావడంతో వర్షాలు కురిసినప్పుడు కొండల పైనుంచి వచ్చిన వరద నీరు ఇక్కడ పోటెత్తుతోంది. ఆ నీరు పొంగిపోయి ఈ బ్రిడ్జి పైనుంచి గ్రామంలోకి చేరుతుంది. దీంతో వర్షాల సమయంలో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలో నుంచి ప్రవహించే నీరు ఇళ్లలోకి చేరుతోంది. గ్రామస్తులు ఈ సమస్య నుంచి బయటపడాలనే ఆలోచనతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ కెల్ల సునీత కృషితో ఇక్కడ బ్రిడ్జి ఎత్తు పెంచడానికి నిర్ణయించారు. జీవీఎంసీ అధికారులతో సంప్రదించారు. దీంతో అధికారులు రూ.36.50 లక్షల నిధులతో ఈ బ్రిడ్జి ఎత్తు పెంచడానికి అంచనా వేశారు. ఈ పనులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించి, గతేడాది నవంబరు 2న శంకుస్థాపన చేశారు. అయితే అప్పటి నుంచి పనులు జరిపించకుండా సదరు కాంట్రాక్టర్ ఇంతవరకు కనిపించలేదు. దీంతో బ్రిడ్జి ఎప్పటిలాగే మిగిలిపోయింది. భారీ వర్షాలు పడితే గ్రామస్తుల సమస్యలు సరామామూలే. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో బ్రిడ్జ్ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం మత్తులో తూలిపడి వ్యక్తి మృతి



మద్యం మత్తులో రాళ్లపై పడి మృతి చెందిన రమేష్ పరిచా

పరవాడ: చినతాడి గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో కింద పడి మృతి చెందాడు. అతుడు ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా భార్గన్ ప్రాంతానికి చెందిన రమేష్ పరిచా(46)గా గుర్తించారు. చినతాడి గ్రామంలో స్నేహితులతో నివాసం ఉంటున్నాడు. ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా పరిచా మద్యానికి బానిసై ఊగుతూ జోగుతూ ఉంటున్నాడు. స్నేహితులను కూడా పట్టించుకోవడం మానేశాడు. ఇదే క్రమంలో శనివారం ఉదయం తన తోటి స్నేహితులు కంపెనీలో విధులకు వెళ్లిపోయారు. పరిచా మాత్రం ఉదయం నుంచి తాగుతూ రాత్రి నివాసం ఉంటున్న ప్రదేశంలో అరుగుపై నిద్ర పోయాడు. అరుగుపై నుంచి కింద నున్న రాళ్లపై పడడం వల్ల తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం నిద్ర లేచిన స్నేహితులు పరిచా మృతి చెందినట్లు గుర్తించి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మల్లేశ్వరరావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న రిక్క తాత (74)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. భోగాపురం మండలం కొత్త చెరకుపల్లికి చెందిన తాత హైవేలో ఒక దుకాణం వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తుండేవాడు. విధులకు హాజరయ్యేందుకు వచ్చిన తాతను విజయనగరం నుంచి విశాఖవైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు అతని మనమడు తోగులురెడ్డి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు .అనంతరం 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. ● శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఫోర్త్‌టౌన్ ఎస్ఐ గౌరి బదిలీ

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ ఎస్.గౌరిని దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మూడేళ్లుగా ఆమె ఫోర్త్‌టౌన్‌లో విధులు నిర్వహించి, పలువురు అధికారుల మన్ననలు పొందారు. గతంలో ఆమె దిశ పీఎస్‌లో పని చేసి ఫోర్త్‌టౌన్ ఎస్ఐగా వచ్చారు. మళ్లీ అక్కడికే గౌరి బదిలీ అయ్యారు.

సీతారాముల ఆలయ అభివృద్ధికి హామీ



ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానిస్తున్న స్థానిక నాయకులు

ఎంవీపీ కాలనీ: స్థానిక అప్పుఘర్‌లోని మూలపాలెం గ్రామాన్ని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం సందర్శించారు. వార్డు పర్యటనలో భాగంగా ఎంపీ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పలు వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా మూలపాలెంలోని శ్రీసీతారాముల ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరగా.. ఎంపీ అంగీకరించారు. ఆలయ అభివృద్ధికి కావాల్సిన ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. దీంతో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వార్డుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరాడ దాసు, మువ్వల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రగతి విధానం హర్షణీయం



వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో చదువుకున్న 1984–86 బ్యాచ్ పీజీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టులు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను చేరువ చేసి నేటి తరం విద్యార్థులకు అందిస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని వీసీ పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో ఆధునికీకరణ పనులు



కూరగాయల స్టాళ్లపై కొత్తగా వేసిన రేకులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో పలు ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇక్కడ కూరగాయల స్టాళ్లపై ఎన్నో ఏళ్ల కిందట వేసిన రేకులు పాడైపోయాయి. కొన్ని చోట్ల ఫ్లోరింగ్ దెబ్బతింది. సీసీ కెమెరాలు పని చేయలేదు. విద్యుత్ దీపాలు వెలగలేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రస్తుతం మరమ్మతులు చేపట్టే పనిలో పడ్డారు. సుమారు రూ.18 లక్షలతో మరమ్మతులు చేయడంతో పాటు స్టాళ్లపై కొత్త రేకులు వేస్తున్నారు. ఇక్కడ స్టాళ్ల గోడలకు పెయింటింగ్‌లు, పాడైన చోట ఫ్లోరింగ్ పనులు చేపడుతున్నారు. ఇక్కడ సుమారు మూడేళ్ల నుంచి పని చేయని సీసీ కెమెరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. పోయిన వాటి స్థానంలో విద్యుత్ బల్బులు అమర్చనున్నట్లు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్ తెలిపారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం



ఉమాగాంధీని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.ఉమాగాంధీని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తరపున గిడుగు అవార్డుకు ఎంపికై సత్కారం పొందిన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతి, విశ్రాంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాదేవి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత. పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత



విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్న సూర్యప్రకాష్

బీచ్ రోడ్డు: ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ఆదివారం రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో స్కాలర్‌షిప్స్ అందజేశారు. వారికి మొత్తం లక్ష రూపాయలను లయన్స్ క్లబ్ గవర్నర్–2 డి.సూర్యప్రకాష్ అందించారు. ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏటా స్కాలర్‌షిప్ అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.